అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 132. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ శనివారం.01.02.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## ఆప్ పార్టీకి ఏడుగురు ఎమ్మెల్యేలు రాజీనామా

న్యూఢిల్లీ : అమృత్ తెలంగాణ:ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఐదు రోజుల ముందు ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీరికి టిక్కెట్ ఇచ్చేందుకు ఆప్ నిరాకరించింది. రాజీనామా చేసిన ఎమ్మెల్యేలు నరేష్ కుమార్, రోహిత్ కుమార్, రాజేశ్ రిషి, మదన్‌లాల్, పవన్ శర్మ, భవన్ గౌడ్ మరియు భూపీందర్ సింగ్‌లు. భూపీందర్ సింగ్ మొదట తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నరేష్ కుమార్ మెహరౌలీ నుండి పోటీ చేశారు. అయితే ఇటీవల ఆప్ విడుదల చేసిన ఐదవ అభ్యర్థుల జాబితాలో మొహరౌలీ నుండి నరేష్‌కుమార్‌కు బదులుగా మహేందర్ చౌదరి పేరు ప్రకటించింది. ఖురాన్ అపవిత్రం కేసులో గతేడాది డిసెంబర్‌లో పంజాబ్ కోర్టు నరేష్ కుమార్‌ను దోషిగా నిర్ధారిస్తూ.. రెండేళ్ల జైలు శిక్ష విధించింది.

## కేసీఆర్ చెల్లని వెయ్యి రూపాయల నోటు

రంగారెడ్డి :అమృత్ తెలంగాణ: 'రాష్ట్రంలో కేసీఆర్ చెల్లని వెయ్యి రూపాయల నోటు.. వెయ్యి రూపాయల నోటు కోసం వెతికితే తీసుకెళ్లి జైల్లో పెడతారు. డిసెంబర్‌లో అధికారం కోల్పోయి.. జూన్‌లో డిపాజిట్ కోల్పోయిన కేసీఆర్.. మతి స్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారు. ఫామ్‌హౌస్‌లో కూర్చోని గప్పాలు కొట్టడం కాదు.. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొని లెక్కలు అని చెబుతా విను' అంటూ మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. విద్యపై పెట్టేది ఖర్చు కాదని.. భవిష్యత్ తరాలకు పెట్టుబడి అని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడం తన బాధ్యత అని హామీ ఇచ్చారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఫరూర్‌నగర్ మండలంలోని మోగిలిగిద్ద గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సీఎంతోపాటు ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్ హాజరయ్యారు.

# సవాళ్లకు నీళ్లొదిలిన కేంద్రం



న్యూఢిల్లీ: అమృత్ తెలంగాణ: దేశ ఆర్థిక స్థితికి అద్దం పట్టే అధికారిక వార్షిక నివేదిక ఎకనామిక్ సర్వేలో అనేక సవాళ్లను మోడీ సర్కార్ విస్మరించింది. అంతర్జాతీయంగా ట్రంప్ టారీఫ్‌ల పెంపు, ఎగుమతుల పతనం, వాణిజ్య లోటు సమస్యలకు పరిష్కారం చూపలేదు. మరోవైపు రికార్డ్ కనిష్టానికి పడిపోయిన రూపాయి విలువపై లెక్కలేని తనంగా వ్యవహరించింది. ఎకనామిక్ సర్వేలో ప్రధానంగా దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు, అవకాశాలను పొందుపర్చాలి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో జరిగిన ప్రధాన మార్పులు, పరిణామాల్ని చెప్పి.. భవిష్యత్తు ప్రణాళికలు ఎలా ఉండాలో మార్గదర్శనం చేయాలి. ప్రధాన రంగాలైన వ్యవసాయం, పారిశ్రామికోత్పత్తి, మౌలిక సదుపాయాలు, ఎగుమతి దిగుమతులు, విదేశీ మారక నిల్వలు, నగదు చలామణి, ఉద్యోగాలు, ధరల పెరుగుదల వంటి అంశాలను కూడా వివరించాలి. విదేశీ భౌగోలిక, ఆర్థిక పరిణామాల ప్రభావం, ప్రభుత్వ విధాన నిర్ణయాలను విశ్లేషించాలి. దీని ఆధారంగానే ప్రతి సంవత్సరం కేంద్ర బడ్జెట్ రూపకల్పన జరుగుతుంటుంది. కానీ దీనికి భిన్నంగా దిశానిర్దేశం లేని ఎకనామిక్ సర్వేను బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో అనేక సవాళ్లు, పరిష్కారాలకు నీళ్లు వదిలేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో జీడీపీ 6.4 శాతానికి పడిపోయి.. నాలుగేండ్ల కనిష్టానికి చేరొచ్చని అంచనా వేసిన ఆర్థిక సర్వే.. వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వివరించలేదు.అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత భారత్‌పై సుంకాలను పెంచుతామని బహి రంగంగా ప్రకటించారు. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డ్ స్థాయిలో 87కు చేరువలో పతనమయ్యింది. ఎగుమతులు పతనం అవుతున్నాయి. వాణిజ్య లోటు పెరుగుతోంది. అనేక రంగాలు మౌలిక వసతుల సదుపాయాల కొరతను ఎదుర్కొంటున్నాయి. పెరుగుతున్న నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, అసంఘటిత రంగం కార్మికుల జీవన ప్రమాణాల మెరుగుదల, మందగిస్తున్న పరిశ్రమల వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, వ్యవసాయన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించే మార్గాలను ఆర్థిక సర్వే గట్టున పెట్టేసింది. ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి రానున్న రోజుల్లో తీసుకోవాల్సిన చర్యల్ని విస్మరించింది. అమెరికా, చైనా లాంటి దేశాలు కృత్రిమ మేధా (ఏఐ)లో పోటీ పడుతూ.. ఈ రంగంలో దూసుకుపోతుండగా.. టెక్నాలజీలో అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉన్న భారత్ వెనుకబాటుపై వివరణ ఇవ్వలేదు. దేశం మెరుగైన వృద్ధి రేటును సాధించకుండా నిరుద్యోగం తగ్గిందని ఎకనామిక్ సర్వేలో ప్రకటన చేయడం నిపుణులను విస్మయానికి గురి చేస్తోంది.

రోజుకు 10 గంటల పని..!

ఎకనామిక సర్వేలో కార్మిక వ్యతిరేక విధానాలు కొట్టిచ్చినట్లు కనబడ్డాయి. ఇటీవల పని గంటలపై తీవ్ర చర్చ జరుగుతోంది. టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ ఫౌండర్ నారాయణ మూర్తి వారానికి 70 గంటలు పని చేయాలని తొలుత కొత్త పాట అందుకోగా.. దీనికి కొనసాగింపుగా అంతకు మించి ఎల్అండ్‌టీ ఛైర్మెన్ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ ఏకంగా 90 గంటల పని చేయాలని.. అంటే రోజుకు 12 గంటలు శ్రమించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ నయా బానిస విధానంపై తీవ్ర చర్చ జరుగుతున్న వేళ కేంద్రం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో ఓ కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. వారానికి 60 గంటల వరకూ పని విధానం పర్వాలేదంటూ కొత్త పాట అందుకుంది. అంటే వారంలో ఒక్క రోజు సెలవు పోయినా.. మిగితా దినాల్లో రోజుకు సగటున 10 గంటల పని చేయాలని ప్రతిపాదించి నట్లయ్యింది. కార్మిక చట్టాల హక్కుల ప్రకారం..వారానికి 48 గంటలు పని మించ కూడదు. కాగా.. వారా నికి 60 గంటలకు మించి పని చేస్తేనే ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడు తుందని ఎకనామిక్ సర్వే పేర్కొంది. రోజుకు 12 గంటలు పని చేయడం ద్వారా అనారోగ్యం పాలవుతారని తెలిపింది. వారానికి ఎక్కువ గంటలు పని చేయడం ఆరోగ్యానికి హానికరం అంటూనే 60 గంటల పని విధానాన్ని ప్రతి పాదించడం వెనుక కార్పొరేట్ శక్తులున్నాయని అర్థం అవుతోంది. మరోవైపు పని గంటలపై పరిమితులు విధించడం ఆర్థిక వృద్ధికి విఘాతం కలుగుతు ందని పారిశ్రామిక వర్గాల మనసులో మాటను ఎకనామిక్ సర్వేలో చెప్పింది. ప్రస్తుత పనిగంటలు కార్మికుల సంపాదన సామర్థ్యాన్ని దెబ్బ తీసే అవకాశం లేకపోలేదని పరోక్షంగా పేర్కొంది. సౌకర్యవంతమైన పని గంటల విధానం భారత్‌ను ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా చేర్చుతుందని.. నూతన ప్రతి పాదిత విధానంతో పరిశ్రమల వృద్ధికి దోహదం జరుగుతుందని తెలిపింది.

ఐదేండ్ల కనిష్టానికి వేతనాలు కార్పొరేట్ల లాభాలు ఫుల్

న్యూఢిల్లీ : నెలసరి వాస్తవ సగటు వేతనాలు పెరగాల్సింది పోయి.. భారీగా తగ్గాయి. మరోవైపు కార్పొరేట్ల ఆదాయాలు, లాభాలు ఫుల్‌గా పెరిగాయి. దేశంలో కార్మికులు 2017-18 స్థాయిల కంటే తక్కువ వేతనాలు పొందుతున్నారని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎకనామిక్ సర్వేలో వెల్లడయ్యింది. 2017-18లో పురుష స్వయం కార్మికుల సగటు నెల వేతనాలు రూ.9,454గా ఉండగా.. 2023-24 నాటికి 9.1 శాతం తగ్గి రూ,8,591కి పరిమితమయ్యాయి. ఇదే సమయంలో మహిళల స్వయం ఉపాధి కార్మికులకు నెలవారీ వేతనం 32 శాతం క్షీణించి రూ.2,950గా నమోదయ్యింది. మరోవైపు పురుష వేతన కార్మికులకు నెలవారీ వేతనం 2017-18లో రూ.12,665గా ఉండగా.. 2023-24 నాటికి 6.4 శాతం తక్కువతో రూ.11,858గా నమోదయ్యింది. ఇదే సమయంలో మహిళా వేతన కార్మికులకు రూ.10,116 నుండి 12.5 శాతం క్షీణించి రూ.8,855కు పరిమితమయ్యింది. పురుష క్యాజువల్ కార్మికుల వేతనాలు 2017-18 స్థాయిలతో పోలిస్తే 2023-24లో 19.2 శాతం పెరిగి రూ.242కు చేరింది. 2017-18లో ఇది రూ.203గా ఉంది. మహిళలకు రూ.128 నుంచి 24 శాతం పెరిగి రూ.159కి చేరింది. గత సంవత్సరాల్లో స్వయం ఉపాధి, జీతభత్యాల కార్మికుల వేతనాలు భారీగా తగ్గాయి. ద్రవ్యోల్బణం అధికంగా పెరిగింది. ఫలితంగా ప్రజల ఆదాయాలు క్షీణించాయి. మరోవైపు "గడిచిన నాలుగేండ్లలో కార్పొరేట్ల నికర లాభాలు సగటున 22 శాతం చొప్పున పెరిగాయి. కంపెనీల ఆదాయాలు పెరిగినా ఉద్యోగుల వేతనాల్లో మాత్రం స్తబ్దత నెలకొంది." అని ఆర్థిక సర్వే పేర్కొంది.

# అనిశ్చితి ఉన్నా ఆర్థిక సుస్థిరత



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: అనిశ్చితి ఉన్నా ఆర్థిక సుస్థిరత సాధించామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. 'విధాన పరమైన పక్షవాత' స్థితి నుండి ఆర్థిక వ్యవస్థను బయటకు తీసుకురావడానికి ప్రభుత్వం దృఢ సంకల్పంతో కృషి చేసిందని ముక్తాయించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభ సందర్భంగా ఆనవాయితీ ప్రకారం పార్లమెంటు సెంట్రల్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉభయ సభల సంయుక్త సమావేశాన్నుద్దేశించి అమె ప్రసంగించారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని కేంద్ర మంత్రివర్గం రూపొందిందిస్తుంది. దానినే రాష్ట్రపతి పొల్లు పోకుండా చదివి వినిపిస్తారు. ద్రౌవపది ముర్ము కూడా అదే పనిచేశారు. కోవిడ్, యుద్ధాలు, ఘర్షణలు ఇలా పలు రకాలైన అనిశ్చిత పరిస్థితులను అంతర్జాతీయంగా ఎదుర్కొంటున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం గుర్తించదగిన సుస్థిరతను ప్రదర్శిస్తూ తన బలాన్ని నిరూపించుకుందని అన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ సుస్థిరతకు మూలస్తంభంగా నిలిచిన భారత్ యావత్ ప్రపంచానికి ఒక ఉదాహరణగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రధానంగా మధ్య తరగతి వర్గాల గురించి పదే పదే ప్రస్తావించారు. . మధ్య తరగతి ప్రజలు ఎంత పెద్ద కలలు కంటే దేశం అంత ఎత్తుకు ఎదుగుతుందని వ్యాఖ్యానించారు.

జమిలి ఎన్నికలు (ఒకే దేశం, ఒకే ఎన్నిక), వక్ఫ్ సవరణ బిల్లును సాహసోపేత నిర్ణయాలుగా ఆమె అభివర్ణించారు. ప్రపంచంలోనే భారత్‌ను మూడో ఆర్థిక శక్తిగా నిలపనున్నట్లు తెలిపారు. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఒక దేశం, ఒక ఎన్నికకు తమ ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు. 'బడ్జెట్-2025లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాల గురించి ఏకరువు పెట్టారు. ఉద్యోగుల కోసం 8వ వేతన సంఘాన్ని నియమించామన్నారు. ఒక దేశం, ఒక ఎన్నిక గురించి పాత పాటే పాడారు. భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని చెప్పారు. .

చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లతో గొప్ప ముందడుగు వేస్తున్నామని,భారతీయులు అంతరిక్షంలో అడుగుపెట్టే రోజు దగ్గర్లోనే ఉందన్నారు.. విద్యా రంగంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. దేశాన్ని గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్ హౌస్‌గా మారుస్తామని పేర్కొన్నారు. ఇండియా ఎఐ మిషన్‌ను ప్రారంభించామని, నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రారంభించామని చెప్పారు. ఈ-గవర్నెన్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు కల్పిస్తున్నామని, పౌర విమానయాన రంగం అభివృద్ధి చెందుతోందని తెలిపారు.

పోలవరం గురించి ప్రస్తావన

పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి కేంద్రప్రభుత్వం కృషి చేస్తోందని, పోలవరం నిర్మాణానికి రూ.12 వేల కోట్లు కేటాయించామని ముర్ము గుర్తుచేశారు. సైబర్ సెక్యూరిటీలో సమర్థత పెంచుతున్నామని, దేశ ఆర్థిక, సామాజిక, జాతీయ భద్రతకు పనిచేస్తున్నామని తెలిపారు. డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలు, డీప్ ఫేక్ పెనుముప్పుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులు, వెనుకబడిన తరగతులకు ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు అందిస్తున్నామని, ఆదివాసీ ప్రాంతాల్లో 30 వైద్య కళాశాలలు ప్రారంభించామని, ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

కొత్త దనం లేని ప్రసంగం!

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం అసాంతం కొత్తదనం ఏమీ లేదు. అదే ప్రసంగం.. అవే వ్యాఖ్యలు. ప్రసంగమంతా ప్రభుత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తారు. అదే సమయంలో దేశంలో నెలకొన్న కీలక అంశాలను కూడా విస్మరించారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధర కోసం సుదీర్ఘ కాలంగా సాగిస్తున్న పంజాబ్ రైతుల పోరాటాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. మహా కుంభమేళాలో తొక్కిసలాట మరణాలను కూడా విస్మరించారు. రాష్ట్రపతి ప్రసంగం పేలవంగా ఉందని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి.

మాజీ ప్రధాని మన్మోహన్‌కు నివాళి

అంతకుముందు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు పార్లమెంట్ ఉభయ సభలు నివాళులు అర్పించాయి. ప్రధానిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. మహా కుంభమేళా తొక్కిసలాట ఘటనలోని మృతులకు ఉభయ సభల సభ్యులు నివాళులర్పించారు.

పేలవంగా రాష్ట్రపతి ప్రసంగం : సోనియాగాంధీ

రాష్ట్రపతి ప్రసంగం పేలవంగా ఉందని సోనియా గాంధీ వ్యాఖ్యానించారు. దీనిపై వివాదం చెలరేగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంపై స్పందించాలని సోనియా గాంధీని మీడియా ప్రతినిధులు అడిగారు. 'రాష్ట్రప్రతి చివరి వరకు చాలా అలసిపోయారు. ఆమె మాట్లాడలేకపోయారు. పేలవంగా ఉంది' అని వ్యాఖ్యానించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ కూడా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంపై స్పందించారు. తన తల్లి వ్యాఖ్యలను ఆయన సమర్థించారు. 'బోరింగ్.. నో కామెంట్స్.. అదే విషయాన్ని మళ్లీ మళ్లీ చెబుతున్నారా?' అంటూ సోనియాగాంధీ మాటల భావాన్ని ప్రస్తావించారు.సోనియా వ్యాఖ్యలను తప్పుబట్టిన రాష్ట్రపతి భవన్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటు సమావేశాలను ఉద్దేశించి చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ నేత సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. సోనియా గాంధీ క్షమాపణలు చెప్పాలని బిజెపి డిమాండ్ చేసింది.

# మేం రాగానే అధ్యాపకుల పదవీ విరమణ వయస్సు పెంచాం: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విశ్వవిద్యాలయాల అధ్యాపకుల పదవీ విరమణ వయస్సును పెంచామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లాలోని మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి, బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.21 వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అంతేకాకుండా, మొగిలిగిద్ద పాఠశాల అభివృద్ధికి దాదాపు రూ. 16 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. గతంలో నోటిఫికేషన్లు జారీ చేసినప్పటికీ, నియామక ప్రక్రియ సంవత్సరాల తరబడి కొనసాగేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, కేవలం 55 రోజుల్లోనే డీఎస్సీ నియామక ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. విశ్వవిద్యాలయాలను పునరావాస కేంద్రాలుగా మార్చారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపకులపతులను నియమించి, ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సును పెంచామని పేర్కొన్నారు. 21 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. విద్యపై చేసే ఖర్చు, భవిష్యత్తుకు పెట్టుబడి అని ఆయన అన్నారు. విద్యాశాఖను తన ఆధీనంలోనే ఉంచుకొని నిత్యం సమీక్షిస్తున్నానని చెప్పారు. మొగిలిగిద్ద పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన అన్నారు.

# నేను కొడితే మామూలుగా ఉండదు



మర్కుక్ :అమృత్ తెలంగాణ: "నేను కొన్నాండ్లుగా గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నా.. మీ అందరికీ తెలుసు.. నేను కొడితే మామూలుగా కాదు.. గట్టిగా కొట్టడం నాకున్న అలవాటు కదా.. ఫిబ్రవరి నెల చివరిలో భారీ బహిరంగసభ పెడదాం.. అందరూ రావాలి. తెలంగాణ శక్తి చూపిద్దాం.." అని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో ఒక్క పథకం కూడా సరిగ్గా అమలు కావడం లేదని, కైలాసం ఆడుతుంటే పెద్దపాము మింగినట్టుగా రాష్ట్ర ప్రజల పరిస్థితి తయారైందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా మేరపల్లి మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా ఝరాసంగం నుంచి నిర్వహించిన పాదయాత్ర శుక్రవారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ క్రమంలో ఝరాసంగంలోని సంగమేశ్వర ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి మాజీ సీఎంకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.ప్రాజెక్టుల్లో ఎలాంటి పురోగతి లేదని ఆరోపించారు. బసవేశ్వర, సంగమేశ్వర, పాలమూరు ప్రాజెక్టులను పడుకోబెట్టారని, కాళేశ్వరాన్ని ఎండబెడుతున్నారని అన్నారు. మళ్లీ కరెంట్ కోతలు, నీళ్ల కరువు కనిపిస్తోందని తెలిపారు. ప్రజలు ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తున్నారని అన్నారు. నమ్మి ఓట్లు వేస్తే మంచి గుణపాఠం చెప్పారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన పథకాల సంగతి పక్కన బెడితే.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను కూడా గంగలో కలిపారని విమర్శించారు. కరోనా సమయంలో కూడా తాము రైతుబంధు, దళితబంధు, పింఛన్లు ఇలా ఏవీ ఆపలేదని గుర్తుచేశారు.

రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించారు

కాంగ్రెస్ పాలకులు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని కేసీఆర్ ఆరోపించారు. గురుకులాల్లో విద్యార్థుల పరిస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతోందన్నారు. గురుకులాల్లో చదువు అగమ్యగోచరమైందని.. పురుగుల అన్నం పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను చెప్పినా ప్రజలు వినలేదని..అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారని అన్నారు.

# పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్






అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలాని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదవ తరగతి పరీక్షలపై సమీక్ష సంబంధిత శాఖల అధికారులతో సమావేశం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటికే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మూడుసార్లు హాజరు విధానం ప్రారంభించినట్లు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించేలా సన్నద్ధం చేయాలని ఆదేశించారు. వేరే గ్రామాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విధంగా బస్సులను నడిపేలా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న ఐదు రోజుల లోపల అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామ సభలను ఏర్పాటు చేసి, విద్యార్థుల తల్లిదండ్రులని ఆహ్వానించాలన్నారు. ఈ గ్రామ సభలలో విద్యార్థుల తల్లిదండ్రులకు విద్య యొక్క ఆవశ్యకతను వివరించి, విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యే విధంగా ప్రోత్సహించాలన్నారు. గత రెండు సంవత్సరాలుగా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలువడం జరిగిందని, ఈ సంవత్సరం కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు మధ్యంతర సన్నద్ధ పరీక్షలు నిర్వహిస్తూ బోర్డు పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. గణితం, ఇంగ్లీష్, సైన్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్ లలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలని, ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నిరంతరం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలని పరీక్షలకు సన్నద్ధం చేయాలనీ సూచించారు. విద్యార్థులను మానసికంగా దృఢంగా చేసి పరీక్షలపై భయాన్ని తొలగించాలని, పాఠాలను సులభంగా గుర్తుంచుకునే విధంగా మెలుకువలు నేర్పించాలన్నారు. సబ్జెక్టుల వారిగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులచే వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున ప్రతి విద్యార్థి తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. తరచూ తరగతులకు గైర్హాజరయ్యే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులు క్రమం తప్పకుండా బడులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు అధికారులు, ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు శాతానికి సంబంధించిన వివరాల నివేదికలను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. ఎంఈఓ లు ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. టి శాట్, తదితర విద్య మాధ్యమాల ద్వారా విద్యార్థులకు సబ్జెక్టులలో మేలుకువలను నేర్పించాలన్నారు. త్వరలోనే మండలాలలో విషయ అవగాహన కలిగిన ఉపాధ్యాయులతో అనువైన పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం ద్వారా పరీక్షల్లో ప్రశ్నలు అడిగే విధానం, సమయ వినియోగం, పాత ప్రశ్నాపత్రాల వివరణ, పరీక్షల ఒత్తిడిని అధిగమించుట తదితర అంశాలను వివరించాలన్నారు. ఈ సమావేశంలో డిఈఓ పి. రామారావు, డి పి ఓ శ్రీనివాస్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ లు పద్మ, సలోమి కరుణ ప్రధానోపాధ్యాయులు, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రేపు స్వచ్ఛభారత్ కు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే......

**బాసరకు పెద్ద మొత్తంలో బిజెపి కార్యకర్తలు తరలిరావాలని పిలుపు....**

**వసంత పంచమి వేళ ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోవడంతో ఆగ్రహం**

**హిందువుల పండుగలపై ఇంత వివక్ష ఎందుకు? ప్రభుత్వ తీరుపై ఆగ్రహం**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

నిర్మల్ జిల్లాబాసర జనవరి 31 అమృత్ తెలంగాణ బాసర, జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో వసంత పంచమి ఏర్పాట్లలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల నుండి అధికారులకు ప్రభుత్వానికి విన్నవిస్తున్నప్పటికీ గోదావరి ఘట్ల ను శుభ్రపరచకపోవడంతో అసంతృప్తికి లోనయ్యారు. హిందువుల పండుగ అంటే ప్రభుత్వానికి ఎందుకంత వివక్షో అర్థం కావడం లేదన్నారు. భక్తులు పుణ్య స్థానాలు ఆచరించే పవిత్ర జలం అపరిశుభ్రతతో ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. రేపు ఉదయం 9 గంటలకు బాసర అమ్మవారి క్షేత్రంలో గోదావరి నది స్నాన ఘట్టాల వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని, పెద్ద మొత్తంలో బీజేపీ కార్యకర్తలు తరలిరావాలన్నారు. స్వచ్ఛభారత్ ఘట్లను పరిశుభ్రం చేద్దామన్నారు. అనంతరం ప్రభుత్వ తీరుపై శాంతియుతంగా నిరసన తెలుపుతామన్నారు.

# మంత్రి సీతక్కతో కలిసి కేస్లాపూర్ నాగోబా జాతరలో పాల్గొన్న సమత ఫౌండేషన్ చైర్మన్ సమతా సుదర్శన్........




కేశ్లాపూర్ నాగోబా జాతరలో మంత్రి సీతక్కతో సమత ఫౌండేషన్ చైర్మన్ పాల్గొన్న దృశ్యం

అమృత్ తెలంగాణ జనవరి 31 అదిలాబాద్ జిల్లా కేస్లపూర్ నాగోబా జాతరను సందర్శించిన సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్, మాట్లాడుతూ పుష్య మాస అమావాస్య పురస్కరించుకొని మెస్రం వంశీయుల మహా పూజతో నాగోబ జాతర ప్రారంభమైంది. రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద జాతరగా పేరుందిన కేస్లాపూర్ నాగోబా జాతరలో 79 ఏళ్లుగా ప్రజా దర్బార్ ను నిర్వహిస్తూన్నారని వస్తున్నారని మొదటిసారి 1946లో కేస్లాపూర్ నాగోబా జాతరను సందర్శించిన మానవ పరిణామ శాస్త్రవేత్త హైమాన్ డార్ఫ్ సూచనల మేరకు అప్పటి నిజాం ప్రభుత్వం గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికగా గిరి దర్బార్ ప్రారంభించరని ప్రత్యేకంగా మెస్రం వంశీయులు కొత్త కోడళ్ళు తెల్లటి దుస్తులు ధరించి బేటింగ్ నిర్వహిస్తారని. ఈ జాతరకు వేరే రాష్ట్రాల నుండి కూడా అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొంటారని ఇలాంటి జాతరలో నేను పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నానని. ఈ జాతర సందర్భంగా గిరిజన సంస్కృతి సంప్రదాయానికి ఓ ప్రత్యేకత ఉందని వారి ఆచార వ్యవహారాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని అందులో ఆదర్శమైన నడవడి ఇమిడి ఉందని వాళ్ళు చేసుకునే పండుగలే ఇందుకు నిదర్శనమని ఏటా పుష్యమి అమావాస్య అర్ధరాత్రి రోజున తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్ వేదికగా ప్రారంభమయ్యే నాగోబా జాతర ఇలాంటి వేడుకేనని ఉత్సవాన్ని ఆదివాసీలు తరతరాలుగా నిర్వహిస్తున్నారని చెట్టుకొకరు,పుట్టకొకరు ఉండే ఆదివాసీ బిడ్డలు జాతర సందర్భంగా ఐక్యతతో ఒకే త్రాటిపై ఉంటారని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఇట్టి జాతర ఉత్సవాలలో సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్, సమత ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ అన్నారు శుక్రవారం పట్టణంలోని బాలాజీ హౌవ్స్ కాలనీలో శ్రీ హనుమాన్ మందిరం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఆలయ శంకుస్థాపనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హిందూ సంస్కృతి సంప్రదాయాలను పిల్లలకు తెలియజేయాలని సూచించారు. నిత్యజీవితంలో ప్రతిరోజు సాధ్యమైనంతవరకు గుడికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మయూర్ చంద్ర అశోక్ రెడ్డి గంగ్రత్ మహేందర్ . కార్తీక్. గంగాధర్ శివ కాలనీవాసులు తదితరులున్నారు.



భూమి పూజ చేస్తున్న శాసనసభ్యులు పాయల్ శంకర్

# అందరి ఆరాధ్య దైవం... నాగోబా



ఆలయాన్ని దర్శించుకున్న ఎంపీ నగేష్ శాసనసభ్యులు పాయల్ శంకర్



నాగోబా ఫోటో ఇస్తున్న గిరిజనులు ఎంపీకి ఎమ్మెల్యేకు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ . భారతదేశంలోని అతిపెద్ద ఆదివాసి జాతర పేరు ఉన్నటువంటి కెస్లాపూర్ నాగోబా జాతర ఎంపీ గేడం నాగేష్ గారుఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయాల్ శంకర్ ఎన్నో ఏళ్ల నుంచి సాంప్రదాయంగా వస్తున్నటువంటి ఆదివాసులకుల దైవం నాగోబా జాతర గిరిజన సాంప్రదాయాల్లో మాకున్నటువంటి సంస్కృతి, సంప్రదాయాలు , అలవాట్లు, జీవన విధానంలో అంతర్భాగమనీ అదిలాబాద్ ఎంపీ జి. నగేష్ అన్నారు. ఈ సమాజంలో ఆదివాసి దేవతలందరినీ కూడా ఆరాధించడం, రెండు రోజుల కిందట మహా పూజ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనేక సంవత్సరాలుగా అఖిలప జిల్లా నే కాకుండా తెలంగాణ రాష్ట్రం, చత్తీస్గఢ్, ఆనేక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు నమ్మకంతో తరలివస్తున్నారన్నారు. భారతదేశంలోని అతిపెద్ద ఆదివాసి జాతర పేరు ఉన్నటువంటి కెస్లాపూర్ నాగోబా ఆలయాన్ని దర్శించడం జరిగిందని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆదిలాబాద్ అన్నారు. నాగోబా జాతర సందర్భంగా శుక్రవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పయాల్ శంకర్, అదిలాబాద్ ఎంపీ జి. నగేష్ తో కలిసి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ గారు మాట్లాడుతూ... అందరి ఆరాధ్య దైవం నాగోబా అని అన్నారు.

ఈ ఆలయానికి తెలంగాణ, మహారాష్ట్ర, వివిధ ప్రాంతాల నుండి వందల సంవత్సరాల నుండి భక్తులు దర్శించుకుంటున్నారన్నారు. నాగోబా ఆలయాన్ని గొప్పగా అభివృద్ధి చేసినటువంటి నాగోబా కేంద్రాన్ని భవిష్యత్తులో ఇంకా అభివృద్ధి చేయాల్సింది అన్నారు. గత ఎంపీ సమయంలో అభివృద్ధి జరిగిందని, ప్రస్తుత ఎంపీ ఇంకా అభివృద్ధి కోసం కేంద్రం నుండి నిధులు తీసుకురావాలని ఎంపీ కు కోరారు..

# నాగోబా ఆలయంలో బోరంచు శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు

**మంత్రి సీతక్క, జిల్లా నేతలతో కలిసి నాగోబా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాంత్ రెడ్డి**

**గిరిజనసాంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేక ఆకర్షణగా మంత్రి సీతక్క, ఆత్రం సుగుణక్క**



ప్రజా దర్బార్ లో పాల్గొన్న మంత్రి సీతక్క మరియు ప్రముఖులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క పక్కన బోరంచు శ్రీకాంత్ రెడ్డి

ఆదివాసీల ఆరాధ్య దైవం, ప్రముఖ పుణ్య క్షేత్రం ఆదిలాబద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం లోని నాగోబా ఆలయంలో నేడు గిరిజన దర్బార్ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు శ్రీమతి ధనసరి సీతక్క ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలతో కలిసి నేడు నాగోబాను తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి దర్శించుకోవడం జరిగింది. గత మూడు రోజులుగా కొనసాగుతున్న మహా జాతరలో భాగంగా గిరిజనుల సమస్యల పరిష్కారానికి, వారి తోడ్పాటుకు ప్రభుత్వం తరుపున నిర్వహించే కార్యక్రమానికి గాను మంత్రి సీతక్క ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఎమ్మెల్సీ దండే విట్టల్ సత్తు మల్లేష్ తెలంగాణ రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి హాజరవ్వగా వారికి సాదరంగా స్వాగతం పలకడం జరిగింది. అనంతరం మాజీ పార్లమెంటు సభ్యులు సోయం బాపురావు, డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, పార్లమెంటు ఇంచార్జి ఆత్రం సుగుణక్క, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ సెడ్మకి ఆనంద్ రావు తదితరులతో కలిసి నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. శ్రీకాంత్ రెడ్డి గారి వెంట నలిమెల నవీన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ రంజిత్, వెంకటేష్,కిరణ్,ఫేరోజ్ తదితరులు ఉన్నారు.

# కేస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా శుక్రవారం నిర్వహించిన నాగోబా దర్బార్ లో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించి నాగోబా ఆలయం లో ప్రత్యేక పూజలు చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పి గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, తదితరులు.

అమృత్ తెలంగాణ ఉట్నూర్ న్యూస్ అనంతరం కొమురంభీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, మెస్రం వంశీయులు బస చేసిన గోవడ్, భక్తులకు కల్పించిన వసతులను, వారు తయారు చేస్తున్న వంటలను పరిశీలించారు.నాగోబా దర్బార్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో జిల్లా పాలనాధికారి రాజర్షి షా పాల్గొని మాట్లాడుతూ నాగోబా దర్బార్ లో ఆర్జీదారులు తమ సమస్యల పై దరఖాస్తులను సమర్పించుటకు అన్ని శాఖలకు సంబంధించిన కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని, అర్జీలను అర్జీదారులు సంబంధిత అధికారులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. గతంలో స్వీకరించిన దరఖాస్తుల సమస్యలను ఐటీడీఏ పీవో తో కలసి పరిష్కరించడం జరిగిందనీ, ఇంతకుముందు కమిటి సభ్యులు కొన్ని సమస్యలను చెప్పడం జరిగిందనీ, వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఐటీడీఏ ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం, అన్ని ఆశ్రమ పాఠశాలలో గిరిజన పోషణ మిత్ర ఏర్పాటు చేయడం జరిగిందని, ఆరోగ్య పాఠశాల కు శ్రీకారం చుట్టి విద్యార్థుల్లో అవగాహనను కల్పించడం జరుగుతుందని అన్నారు. భారత దేశంలో రెండవ అతిపెద్ద గిరిజన జాతర విశిష్టత పై దేశ నలుమూలల తెలిసేలా కార్యక్రమాలు చేపట్టాలని, మెస్రం వంశీయుల కట్టుబాట్లు, సంస్కృతి సంప్రదాయాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని ఆన్నారు. తొలిసారి 1942లో నిర్వహించిన దర్బార్ హేమన్ డార్ఫ్ ఆధ్వర్యంలో జరిగిందని, నాగోబా జాతర సందర్భంగా ఈ సారి నాగోబా సన్నిధిలో నిర్వహించే దర్బారు కు 78 సంవత్సరాలు పూర్తి చేసుకొని 79 లోకి అడుగుపెడుతున్నదని ఆన్నారు. ఈ దర్బార్ లో గిరిజనులు అధికారుల వద్ద తమ సమస్యలను విన్నవించి అధికారుల ద్వారా వారి వినతులు పరిష్కారం అయ్యేవని ఆసియాలో 2 వ అతిపెద్ద ఆదివాసీ వేడుక నాగోబా జాతర వైభవంగా కొనసాగుతోందన్నారు గత మూడు రోజుల నుండి నాగోబా జాతరకు భక్తుల రద్దీ ఎక్కువగా పెరుగుతుందని, నాగోబ జాతరలో దర్బార్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దర్బార్ లో స్వీకరించిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నిన్న సాయంత్రం గురువారం మొదటిసారి గా కళ ప్రదర్శన నిర్వహించడం జరిగిందనీ, కేస్లాపూర్ లోని నాగోబా జాతర లో దర్బార్ రోజున కళ ప్రదర్శన ప్రతీ సారి నిర్వహించడం , ఈసారి ప్రభుత్వం నాగోబా జాతర దర్బార్ కంటే ముందు గురువారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం మొదటి సారిగా నిర్వహించడం, అందులో హైదారాబాద్ టీం కళాకారులతో పాటుగా జిల్లా స్థాయి కళాకారులు పలు గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం, డ్యాన్స్ లు చేయడం అందరి చూపరులను ఆకట్టుకుని, విజయవంతం చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ASP% KÈýÙ, FDO రేవంత్ చంద్ర, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభి గ్యాన్ , ఆలయ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, మెస్రం వంశీయులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజా దర్బార్లో మాట్లాడుతున్న జిల్లా పాలన అధికారి

# జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకొని ఒకరి మృతి,...

**భార్య మృతి చెందడంతో ఒంటరి జీవితం గడుపుతూ మద్యానికి బానిసై అహత్మహత్య చేసుకున్న యువకుడు**

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి జనవరి 31 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి గ్రామానికి చెందిన కోడె ప్రభాకర్ 40 అతని భార్య భార్య గత నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఒంటరి జీవితాన్ని గడుపుతూ మద్యానికి బానిసై మద్యం మత్తులో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం సాయంత్రం తన ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం జరిగింది అని మృతుడి అక్క కోడె సత్తవ్వ, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎస్.ఐ సాయి కిరణ్, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు



ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ప్రభాకర్ మృతదేహం

# కేంద్ర బడ్జెట్ లో ఆదిలాబాద్ జిల్లాకు నిధులు కేటాయించలని ఆదిలాబాద్ జిల్లా అఖిల పక్షం రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది!



అఖిలపక్షం నాయకులు

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ కేంద్రం రేపు ప్రవేశ పెట్టబోయే బడ్జెట్ లో ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి కేంద్ర బిందువులైన సిమెంట్ కార్పొరేషన్ పునర్ ప్రారంభానికి, విమానాశ్రయం నిర్మాణానికి , ఆదిలాబాద్ నుండీ ఆర్మూర్ వరకు రైల్వే లైన్ మంజూరు ,సెంట్రల్ యూనివర్సిటీ, టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ సిపిఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ , జిల్లా ఉపాధ్యక్షులు విజ్జగిరి నారాయణ, ఆదిలాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, ఆదిలాబాద్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్ జిల్లా కార్యవర్గ సభ్యులు చిల్కా దేవిదాస్, సీపీఎం ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వెంకట్ నారాయణ, రైతు %ఝుఎ% నాయకులు బండి దత్తాత్రి, లంక రాఘవులు, పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు ఆదిలాబాద్ ఏరియా కార్యదర్శి,లోకారి పోశెట్టి , మహిళా సంఘం జిల్లా కార్యదర్శి లంక జమున , సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి బొజ్జ ఆశన్న ,అన్నమొల్ల కిరణ్ , మాట్లాడుతు జిల్లా ప్రజలు బీజేపీ ఎంపీ ఎం.ఎల్ .ఎ .లను గెలిపించారు .బీజేపీ ఈ జిల్లా ప్రజలకు రుణపడి ఉన్నది .వారి రుణం తీర్చుకోవడానికి ఈ బడ్జెట్ లో పై వాటికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు . కేటాయించని యెడల ఐక్య పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, సిపిఎం జిల్లా నాయకులు ఆర్ .మంజుల ,ఆర్ .సురేందర్ , కే .ఆశన ,ఎన్ .స్వామి తదితరులు పాల్గొన్నారు .

# జానపద గీతాలతో ప్రజలను ఆకట్టుకుంటున్న కుస్లీ రత్నం..

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి జనవరి 31 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని కుస్లి, గ్రామానికి చెందిన శివులోల్ల రత్నం, అనే యువకుడు తన కళా ప్రదర్శనతో ఆకట్టుకుంటూ మంచి మంచి జానపద పాటలు పాడుతూ తన యూట్యూబ్ ద్వారా జానపద కళాకారులను పరిచయం

చేస్తూ వారు పాడే జానపద గీతాలతో ప్రజలను ఆకట్టుకుంటున్నారు మునుముందు సమాజ హితమైన పసందైన జానపద గీతాలను అందిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు

# పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ముధోల్ :అమృత్ తెలంగాణ: పదవ తరగతివిద్యార్థుల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, నాణ్యమైన విద్యా బోధన చేయాలని ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైనా ముధోల్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా10, తరగతుల విద్యార్థులకు సంబంధించిన హాజరు పట్టి తదితరవి పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని అన్నారువిద్యార్థులను అడిగి పాటలు సరిగ్గా చెబుతున్నారు లేదా అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు విద్యార్థులకు పలు సలహా సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు



## నిజమైన నేస్తం దినపత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి



నెల్లూరు( విడవలూరు) జనవరి 31(శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు నగరం, రామ్మూర్తి నగర్ టిడిపి కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి నిజమైన నేస్తం దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిజమైన నేస్తం పత్రిక ఎడిటర్ మల్లు రాజేంద్ర ప్రసాద్, గుడి ప్రసాద్ రెడ్డి, కేడివి మల్లికార్జున, డి రమేష్ పాల్గొన్నారు

## చీరాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస.....



అమృత్ తెలంగాణ: చీరాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో రసాభాస చోటుచేసుకుంది. శుక్రవారం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన మున్సిపల్ సమావేశ మందిరంలో జరిగింది. కౌన్సిల్ సమావేశం ప్రారంభించగానే వైస్ చైర్మన్ బొనిగల జైసింబాబు లేచి గడిచిన సమావేశంలో 31 వ వార్డు కౌన్సిలర్ సల్లూరు సత్యానందం చైర్మన్ సీటును అగౌరపరుస్తూ మాట్లాడిన విషయాన్ని తేల్చిన తరువాత సభను కొనసాగించాలని పట్టుబట్టారు. పలువురు వైసిపి కౌన్సిలర్లు లేచి సత్యానందం సభకు క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. చైర్మన్ సత్యానందమును వివరణ కోరగా సత్యానందం సభను ఉద్దేశించి మాట్లాడుతూ చెప్పిన సమాధానానికి సంతృప్తి చెందని కౌన్సిలర్లు సస్పెండ్ చేయాలని పట్టుబట్టారు. టీడీపీ కౌన్సిలర్ సత్యనందంను సభ నుండి మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు సస్పెండ్ చేశారు. గత కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ సిటును అగౌరవపరుస్తూ మాట్లాడరని 3 నెలలు పాటు సస్పెండ్ చేసినట్లు చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. చైర్మన్ శ్రీనివాసరావు అగౌరవంగా మాట్లాడడమే కాక తనను అన్యాయంగా సస్పెండ్ చేశారని 31 వ వార్డ్ కౌన్సిలర్ సల్లూరి సత్యానందం తెలిపారు. అజెండా లోని అంశాలపై టిడిపి ,వైసిపి కౌన్సిలర్ మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది .ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఎం. ఎం కొండయ్య యాదవ్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమమై లక్ష్యంగా కృషి చేస్తుందని,చీరాల నియోజకవర్గ అభివృద్ధికి కోట్ల రూపాయలను వెచ్చించిందని ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ సభను నిర్వహించుకోవాలని కౌన్సిలర్ సత్యానందం సస్పెండ్ ను చైర్మన్ శ్రీనివాసరావు వెనక్కితీసుకోవాలని తెలిపారు. చైర్మన్ సభ ను బాయ్ కాట్ చేసి వెళ్లిపోయారు. సభ ను అగౌరవపరుస్తూ చైర్మన్ వెళ్లిపోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని అవిశ్వాస తీర్మానానికి సిద్ధం కావాలని కౌన్సిలర్లకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలోఅన్ని పార్టీలకౌన్సిలర్లు మున్సిపల్‌సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులకు మూడు కేసులలో ఒక్కొక్కరికి నెల రోజుల చొప్పున జైలు శిక్ష

ఆలమూరు అమృత్ తెలంగాణ: జనవరి 31. వాహన తనిఖీలలో భాగంగా మద్యం సేవించి వాహనం నడుపుచున్న ముగ్గురు వ్యక్తులను ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ అదుపులోనికి తీసుకొని శుక్రవారం నాడుగౌరవ మేజిస్ట్రేట్ వారి ఎదుట హాజరు పరచగా, ఆలమూరు కోర్టు మేజిస్ట్రేట్ అయిన వి.నాగేశ్వరావు నాయక్ ఒక్కొక్కరికి ఒక నెల రోజుల చొప్పున జైలు శిక్ష విధించినారు అని ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ తెలియపరచినారు.ఇక మీదట కొత్త చట్టాల ప్రకారం శిక్షలు విధించడం జరుగుతుందని వాహనదారులకు ఆలమూరు ఎస్సై హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని,అదే విధముగా హెల్మెట్ ను తప్పని సరిగా ధరించాలని, తమ కోసం ఇంటి వద్ద భార్య, పిల్లలు తల్లితండ్రులు ఎదురుచూస్తూ ఉంటారనే విషయాన్ని గుర్తుపెట్టుకో వాలని వాహనదారులకు ఎస్.ఐ.అశోక్ సూచించారు.

శిక్ష పడిన వారి వివరాలు:

1) అర్లపల్లి శ్రీరామకృష్ణ తండ్రి సత్యనారాయణ
కోరుమిల్లి గ్రామం
కపిలేశ్వరపురం మండలం
2) పాండురాజుల భాస్కర్ గణేష్ తండ్రి సత్యనారాయణ ఆలమూరు గ్రామం
ఆలమూరు మండలం
3) కొప్పిరెడ్డి శ్రీను తండ్రి నాగేశ్వరరావు మడికి గ్రామం ఆలమూరు మండలం

## టెన్త్ విద్యార్థులకు యుటిఎఫ్ స్టడీ మెటీరియల్



అమృత్ తెలంగాణ: ఉప్పలగుప్తం భీమనపల్లి శ్రీ శిరంగు రంగనాయకమ్మ జడ్పి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఆ పాఠశాలలో శుక్రవారం అందజేశారు. హెచ్ఎం నూకల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తురగా సీతమ్మ, అయ్యగారి సత్యవతి, గిడుగు లక్ష్మీదేవి సోదరీమణుల జ్ఞాపకార్థం వారి సోదరుడు గిడుగు సత్యనారాయణ ఈ స్టడీ మెటీరియల్‌ను సమకూర్చారు. త్వరలో నిర్వహించనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్న ఉద్దేశంతో స్టడీ మెటీరియల్ అందజేసినట్టు దాత సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ గుర్లింక చిన్న, ఉపాధ్యాయులు అరవ నాయుడు, నడింపల్లి పద్మనాభన్, లక్ష్మి, పచ్చిమాల శివనాగరాజు, ముత్యాల నరసింహమూర్తి, వేటూరి వెంకటే శ్వరరావు, సుబ్బారావు, పీడీ, కామన మధుసూదనరావు పాల్గొన్నారు.

## శిధిల వ్యవస్థలో మూల గుంటపాడు గ్రామ పంచాయతీ పట్టించుకోని పంచాయతీ సర్పంచి.





సింగరాయకొండ అమృత్ తెలంగాణ:: జనవరి. 31 ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామపంచాయతీ కార్యాలయం శిథిల వ్యవస్థకు చేరిందంటే ఇట్టే అర్థమవుతుంది, కార్యాలయం లోపలి భాగంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కూర్చునే ప్రదేశము పై భాగంలో స్లాబ్ పెచ్చుకలు పగుళ్లు ఊడి కింద పడిపోతున్నాయి ఏ క్షణాన ఎవరి మీద ఎటువైపు నుంచి అలాంటి స్లాబ్ కాంక్రీట్ పిచ్చుకలు ఎవరిపై పడతాయో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పంచాయతీ కార్యాలయానికి వచ్చే ప్రజల మీద ఎటువైపు నుంచి ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామపంచాయతీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, అయితే ఈ నేపథ్యంలో భాగంగా ఈ గ్రామపంచాయతీ వాస్తవానికి మేజర్ పంచాయతీ అయినా అభివృద్ధి కార్యక్రమాల్లో మాత్రం ఆమడ దూరంలో ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెప్పుకుంటున్నారు, గ్రామపంచాయతీ కార్యాలయం స్లాబ్ లోపలి పైభాగం అంత దుర్భరంగా ప్రజలకు అధికారులకు దర్శనమిస్తుంటే కనీసం గ్రామపంచాయతీ సర్పంచ్ బత్తుల శివరాం రెడ్డి రిపేర్ కార్యక్రమానికి కూడా ఈరోజు వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని గ్రామపంచాయతీ ప్రజలు చెప్పుకుంటున్నారు, ఈ కార్యానికి ప్రతిరోజు ప్రజా సమస్యల మీద ప్రజలు వస్తూ పోతుంటారు వారి వారి సమస్యలు పై పలు వర్గాలకు చెందిన పంచాయతీ ప్రజలు వారి సమస్యలపై వినతి పత్రాలు ఇస్తూ సమస్యల పరిష్కరించుకునే విధానములో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు అందుకు అధికారులు కూడా సహకరించడం మంచిదే కానీ కార్యాలయం లోపలి స్లాబ్ పైభాగం పూర్తిగా సిద్ధలా వ్యవస్థకు చేరకుంటే పంచాయతీ సర్పంచ్ బత్తుల శివరామిరెడ్డి కనీసం రిపేర్ కార్యక్రమానికైనా మరమ్మతు పనులు చేయించకపోవడం పంచాయతీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు మూలగుంటపాడు మేజర్ పంచాయతీ కార్యాలయం స్లాబ్ లోపలి భాగం గ్రామపంచాయతీ కార్యదర్శి కూర్చునే ప్రదేశం పై భాగంలో స్లాబ్ మరమత్తులు గ్రామపంచాయతీ సర్పంచ్ డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి వెంటనే స్పందించి మరమత్తు పనులు కు శ్రీకారం చుడతారని గ్రామపంచాయతీ ప్రజలు చెప్పుకుంటున్నారు ఈ కార్యాలయానికి స్లాబ్ లోపల పైభాగం కు సంబంధించిన రిపేర్ కార్యక్రమాలకు వెంటనే శ్రీకారం చుట్టే విధంగా గ్రామపంచాయతీ సర్పంచ్ బత్తుల శివరామిరెడ్డి వెంటనే స్పందించి ఆయా మరమత్తు పనులు చేయించాలని ప్రజలు కోరుకుంటున్నారు

## 11 డివిజన్ లో అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి నష్టపోయిన వైసిపి కార్యకర్త చెంచయ్య కుటుంబాన్ని.. పరామర్శించి ఆర్థిక సాయం చేసిన.. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



నెల్లూరు అమృత్ తెలంగాణ: జనవరి 31 శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు 11 వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ మూడు జెండాల సెంటర్ ప్రాంతంలో అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి నష్టపోయిన వైయస్సార్సీపి కార్యకర్త చెంచయ్య కుటుంబాన్ని.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గం ఇంచార్జ్ / ఎమ్మెల్సీ లిపర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదానికి గురైన ఇంటిని చంద్రశేఖర్ రెడ్డి గారు పరిశీలించి..చెంచయ్యకు కొంత ఆర్థిక సాయం చేశారు ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి వెంట వైసిపి నాయకులు మహేష్, శ్రీనివాసులు,చంద్రమోహన్, ,నాగేంద్ర, ఆటో చంద్ర, మనోజ్, సుప్రియమ్మ, సులోచనమ్మ, సుహాసిని, సుమతి తో పాటు 14 వ డివిజన్ ఇంచార్జ్ గిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న బాలమందిరం కార్యక్రమం



ఆలమూరు (కోనసీమ) :అమృత్ తెలంగాణ:అంగర లక్ష్మీకాంతం(సాల్క్) ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వహించే బాలమందిరం కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం బాలమందిర బాలల సభను మండలంలోని చింతలూరు ఎం.పి.పి. పాఠశాల నందు నిర్వహించారు. ప్రముఖ కవి, రచయిత అంగర గోపాలకృష్ణచార్యులు( కృష్ణశ్రీ ) 3, 4, 5 తరగతుల విద్యార్థులకు సాహిత్య పఠనం, కథ తయారీ, భాషా నైపుణ్యాలు, నాటకీకరణ, పాటలపై విద్యార్థులకు అవగాహన కల్పించి వాటిలో శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా కృష్ణశ్రీ ఇచ్చిన సూచనలతో కేవలం చెప్పిన కథను ఆధారంగా చేసుకుని విద్యార్థులే వారు సొంతంగా మాటలు తయారు చేసుకుని వేసిన నాటకం అందరినీ ఆకట్టుకుంది. ఈ బాల మందిరం కార్యక్రమాన్ని మండలంలో ఉన్న అన్ని పాఠశాలలో నిర్వహిస్తామని కృష్ణశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, సిఆర్ఎంటి అపర్ణ పాల్గొన్నారు.

## తుస్సుమన్న "ప్రసన్న" విప్ అస్త్రం

- కండువా మార్చేసిన బుచ్చి 10 వ వార్డు వైసీపి కౌన్సిలర్ మల్లారెడ్డి.
- టిడిపి నేతల టచ్లో మరో ముగ్గురు కౌన్సిలర్లు.
- నిరాశ, నిస్పృహలో మాజీ ఎమ్మెల్యే ప్రసన్న శిబిరం.
- వేమిరెడ్డి దంపతుల సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్న బుచ్చి వైసిపి సీనియర్లు.

బుచ్చి అమృత్ తెలంగాణ: జనవరి 31 శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాలెం మండలం బుచ్చిరెడ్డి పాళెం నగర పంచాయతి వైస్ చైర్మన్ ఎన్నిక మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డికి పరాభవాన్ని మిగల్చనుంది. విప్ జారీ చేసి వైస్ చైర్మన్ పదవి కైవసం చేసుకోవాలని ప్రసన్న కన్నకలలు భగ్నమయ్యాయి. బుచ్చి పట్టణ వైసిపి కౌన్సిలర్లు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కి జై కొడుతూ సైకిల్ ఎక్కేస్తున్నారు. బుచ్చి నగర పంచాయతిలో జరగనున్న వైస్ చైర్మన్ ఉప ఎన్నికలో నిన్నటి దాకా అభ్యర్థిని బరిలో దింపుతానని ప్రగల్భణాలు పలికిన ప్రసన్న యిప్పుడు అంతర్మథనంలో పడ్డారు. వైసిపి కౌన్సిలర్ల వలసలు చూసాక నిన్నటి దాకా విప్ జారీ పై హడాహుడి చేసిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్న శిబిరం డీలా పడి పోయింది.



వైసిపి సీనియర్ నాయకులు ఇప్పగుంట మల్లారెడ్డి నేతృత్వంలో 10 వార్డు కౌన్సిలర్ బెళుం మల్లారెడ్డి తో పాటు బుచ్చి మండల వైసిపి కన్వీనర్ టంగుటూరు మల్లికార్జున్ రెడ్డి, సీనియర్ నాయకులు చెన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కంఠం నరసింహులు, ఆకే రవి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రసన్న నియంతృత్వ ధోరణిని నిరసిస్తూ తాము టిడిపి బాట పట్టామన్నారు. వేమిరెడ్డి దంపతుల నాయకత్వంలో బుచ్చిరెడ్డి పాళెం అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఉత్తమ పంచాయతిగా మిక్కిలింపేట

కొడవలూరు అమృత్ తెలంగాణ: జనవరి 31 శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం కొడవలూరు మండలం మిక్కిలింపేట సర్పంచ్ కోడూరు చంద్రశేఖర్ రెడ్డి ని ఆదర్శంగా తీసుకొని ప్రతి గ్రామ సర్పంచ్ గ్రామాభివృద్ధికి పాటు పడాలని కోరారు వేమిరెడ్డి దంపతులు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడంలో ప్రత్యేక శ్రద్ధ చూపి జాతీయ స్థాయిలో ఉత్తమ సర్పంచ్ గా ప్రశంసలందుకున్న కొడవలూరు మండలం మిక్కిలింపేట సర్పంచ్ కోడూరు చంద్రశేఖర్ రెడ్డి ని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి దంపతులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు



ప్రతి అర్హులకు చేర్చడంలో గ్రామ సర్పంచులు చొరవ చూపాలన్నారు. గ్రామాలలో ప్రజలకు సురక్షిత తాగునీటి సదుపాయాలతో పాటు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె సూచించారు.

## లారీ దగ్ధమై మృతిచెందిన డ్రైవర్ కుటుంబానికి రూ.20లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సిపిఎం

డి.హీరేహాల్ (అనంతపురం) అమృత్ తెలంగాణ: లారీకి కరెంటు తీగలు తగిలి లారీతోపాటు డ్రైవర్ సజీవదహనమైన ఘటన శుక్రవారం అనంతపురం జిల్లా డి.హీరేహాల్ మండలం సోమలాపురం గ్రామంలో జరిగింది. సోమలాపురం గ్రామంలో రైల్వే స్టేషన్ నుండి ఫ్యాక్టరీలకు ఇనుప ఖనిజాన్ని లారీలు, టిప్పర్ల ద్వారా తరలిస్తుంటారు. అలాగే ఈరోజు ఉదయం కూడా ఒక టిప్పర్‌లో ఇనుప ఖనిజాన్ని రాయదుర్గం దగ్గర గల ఫ్యాక్టరీకు తరలించానికి వచ్చారు. ఆ సమయంలో రైల్వే స్టేషన్ కు సమీపాన ఉన్న వే బ్రిడ్జి వద్ద డ్రైవరు లారీ ట్రాలీని పైకి ఎత్తుతుండగా, అక్కడే ఉన్న కరెంటు తీగలు టిప్పర్ ట్రాలీకి తగిలి లారీ దగ్ధమయ్యింది. దీంతో ఆ లారీ డ్రైవర్ అక్కడికక్కడే మరణించాడు. మఅతి చెందిన డ్రైవర్ కుటుంబానికి 20 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను అందించాలి: సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డీ.హీరేహళ్ మండలం సోమలాపురం గ్రామంలో రైల్వే స్టేషన్ దగ్గరలో నేటి ఉదయం జరిగిన సంఘటన





టిప్పర్ దగ్ధం కావడం డ్రైవర్ సైఫుల్ల మృతి చెందడం చాలా బాధాకరమైన దురదఅష్టకరమైన సంఘటన అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి మల్లికార్జున తెలిపారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి రాయదుర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మఅతి చెందిన లారీ డ్రైవర్ సైఫుల్ల మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ జరిగిన సంఘటన చాలా బాధాకరమైనదని, మఅతుడి కుటుంబానికి సిపిఎం పార్టీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తుందని తెలిపారు. అదేవిధంగా ఈ ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, సోమలాపురం గ్రామం నుండి మండల వ్యాప్తంగా మరియు ఇతర ప్రాంతాలలో ఉన్న స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీలకు ఇక్కడినుండి మైన్స్ సరఫరా చేసే కాంట్రాక్టర్స్ తక్షణమే ఈ సంఘటనపై స్పందించి మఅతుడి కుటుంబానికి తక్షణ సహాయంగా 20 లక్షల రూపాయలను ఎక్స్‌గ్రేషియాను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, ప్రాంతీయ కమిటీ సభ్యులు మధు, తిమ్మరాజు, బాబు, రమేష్ శంకర్ పాల్గొన్నారు.

## రహదారి భద్రతపై అవగాహనా ర్యాలీ



రాజమహేంద్రవరం అమృత్ తెలంగాణ: రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం నగరంలో అవగాహనా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పోలీసులు, జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అడిషనల్ ఎస్పి(అడ్మిన్) ఎన్‌బిఎం.మురళీకృష్ణ, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ఆర్.సురేష్ ప్రారంభించారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జెఎన్ రోడ్, రామాలయం సెంటర్, ముగ్గుపేట సెంటర్, ఆజాద్ చౌక్, దేవీచౌక్, కంబాలచెరువు మీదగా చిరంజీవి బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం చిరంజీవి బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించినారు. అనంతరం అక్కడ నుంచి హైటెక్ బస్టాండ్, వై జంక్షన్, సెంట్రల్ జైల్ రోడ్డు, లాలాచెరువు మీదగా జిల్లా పోలీస్ కార్యాలయానికి ర్యాలీ చేరుకుంది. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి మాట్లాడారు. హెల్మెట్ ధరించడం అందరి బాధ్యత అన్నారు.

బండి నడిపే వారితో పాటు వెనక కూర్చున్న వారు కూడా తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి డిఎస్‌పి బి.రామకృష్ణ గారు, ఎస్‌బి సిఐ ఎ.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిఐలు నబి, సిహెచ్.సూరిబాబు, మహిళా పిఎస్ సిఐ కె.మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేయాలి



గుంటూరు : అమృత్ తెలంగాణ:జనవరి 31. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి ఎలక్షన్ కమిషన్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినందున ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని బాపట్ల, పల్నాడు, ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు డిఆర్‌ఓలు, తెనాలి సబ్ కలెక్టర్, ఇతర జిల్లా మండల అధికారులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై వెబెక్స్ ద్వారా గుంటూరు కలెక్టరేట్ నుండి గురువారం మాట్లాడారు. 29వ తేదీ నుండే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఈసీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఫిబ్రవరి 10వ తేదీ వరకూ నామినేషన్లు దాఖలు, 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉప సంహరణ, ఫిబ్రవరి 27న ఓటింగ్ ఉంటుందని చెప్పారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ ఉంటుందన్నారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఎన్నికలు సజావుగా చేపట్టేందుకు సంబంధిత అధికారులు ముందస్తుగా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ సూచించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూచా తప్పకుండా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో రాజకీయ నాయకుల చిత్ర పటాలు తొలగించాలన్నారు. రాజకీయ నాయకుల బ్యానర్లు , పోస్టర్లు వంటివి తొలగించి నివేదిక ఇవ్వాలని చెప్పారు. రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలను కప్పి ఉంచాలన్నారు. గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేందుకు జనవరి 31వ తేదీ వరకూ అవకాశం వుందని తెలియజేస్తూ ఫిబ్రవరి 10వ తేదీలోపు వాటిని పరిశీలించి సంబంధిత ఎన్నికల అధికారి డిస్పోజ్ చేయాల్సి వుందని వివరించారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లో నిబంధనల మేరకు అన్ని వసతులూ ఏర్పాటు చేయాలని, పోలింగ్ గదులు విశాలంగా వుండి వెలుతురు బాగా వుండేటట్లు చూడాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ల వివరాలు శుక్రవారం సాయంత్రం లోపు అందించాలని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున రాజకీయ పార్టీలతో సమావేశాలు ఏర్పాటు చేసి శుక్రవారం సాయంత్రంలోపు వివరాలు అందించాలన్నారు. ఎన్నికలు పేపర్ బ్యాలెట్ ద్వారా జరుగుతాయని, బ్యాలెట్ బాక్సుల లభ్యత వివరాలు తెలపాలని చెప్పారు. వారి వద్ద వున్న బ్యాలెట్ బాక్సులను మరమ్మతులు చేపట్టి వాటికి బాగా ఆయిలింగ్ చేసి వివరాలు అందించాలన్నారు. సమావేశంలో జేసీ ఎ.భార్గవ్‌తేజ, డిఆర్ఓ షేక్. ఖాజావలి, జెడ్పీ సిఇఒ జ్యోతిబసు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 'ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి' : గ్రామపంచాయతీ సెక్రటరీ - రైతు కుటుంబం ఆత్మహత్యాయత్నం..!



పెనుకొండ (అనంతపురం) అమృత్ తెలంగాణ: జనవరి 31. రైతు మరణ ధ్రువీకరణ పత్రం కోసం కుటుంబం అగచాట్లు పడుతుంటే ''ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి భయపడతా అనుకున్నారా ?" అని గ్రామపంచాయతీ సెక్రటరీ ఆ కుటుంబాన్ని ఇబ్బందులు పెడుతున్నాడు. దీంతో గత్యంతరం లేక ఆ రైతు కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం మండల పరిధిలోని మావుటూరులో జరిగింది. గతేడాది నవంబర్ నెలలో సుధాకర్ రెడ్డి అనే రైతు ఉరేసుకొని చనిపోయాడు. ఆ రైతు డెత్ సర్టిఫికెట్ కోసం కుటుంబీకులు దరఖాస్తు చేసుకున్నారు. గ్రామపంచాయతీ సెక్రటరీ శ్రీరాములు డెత్ సర్టిఫికెట్ ఇవ్వకుండా అలసత్వం వహిస్తున్నారని కుటుంబీకులు ఆరోపించారు. ప్రతిరోజూ సుధాకర్ రెడ్డి తండ్రి రఘు రామిరెడ్డి ఆస్తమాతో బాధపడుతూ, ప్రతిరోజు సచివాలయం దగ్గరికి వెళుతున్నాడు. సెక్రటరీ తన చుట్టూ రఘురామిరెడ్డిని తిప్పించుకుంటున్నారే తప్ప సర్టిఫికెట్ ఇవ్వడం లేదు. దీంతో ఈ విషయాన్ని ఎండిఓ ఆఫీసుకు ఫోన్ ద్వారా తెలిపారు. అప్పటి నుండి ఆ రైతు కుటుంబాన్ని సెక్రటరీ ఇంకా ఎక్కువగా ఇబ్బందిపెట్టారు. ' ఎంపిడిఓ దగ్గరే సర్టిఫికెట్ ఇప్పించుకోండి ' ' భయమా.. మీరు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి ' అని పంచాయతీ కార్యదర్శి బెదిరించారని కుటుంబీకులు వాపోయారు. తమకు ఆ డెత్ సర్టిఫికెట్ ఇస్తే చనిపోయిన తమ కుమారుడు తాకట్టు పెట్టిన బంగారం విడుదల అవుతుందని, ఇన్సూరెన్స్ కంపెనీ వాళ్ళు జనవరి 20వ తారీకు లోపు డెత్ సర్టిఫికెట్ ఇస్తే డబ్బులు వస్తాయి లేకపోతే రావని చెప్పారని ఆ రైతు కుటుంబీకులు కంటతడిపెట్టారు. తమ కుటుంబ సభ్యులందరూ కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నామని రఘురామి రెడ్డి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

## విద్యతోనే అభివృద్ధి

మండపేట :అమృత్ తెలంగాణ: విద్యను అభ్యసించడం ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యమని మండపేట రూరల్ సిఐ పి.దొరరాజు అన్నారు. అర్తమూరు సత్య భాస్కర జడ్‌పి హైస్కూల్లో విద్యార్థులతో ఏర్పాటుచేసిన మాదకద్రవ్యాల దుర్వినియోగం, రోడ్డు భద్రత నియమాలపై అవగాహనా సదస్సులో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. చదువుకునే వయస్సులో చదువుపై పెట్టే శ్రద్దె భవిష్యత్తు నిర్ణయిస్తుందనిసీఐ అన్నారు. చెడు స్నేహాలకు వెళ్లకుండా బాగా చదువుకొని అనుకున్న లక్ష్యాలను చేరుకుని ఉన్నత విలువలు గల వ్యక్తులుగా రాణించాలన్నారు. విద్యార్థి దశలో సోషల్ మీడియా జోలికి వెళ్లి కాలాన్ని వృథా చేసుకోవద్దన్నారు. వచ్చే పబ్లిక్ పరీక్షలకు కాలయాపన లేకుండా శ్రద్దగా చదివి మంచి మార్కులుతో ఉత్తీర్ణులు అవ్వాలని అన్నారు. మత్తుకు సంబంధించినటు వంటి చెడు వ్యసనాలకు బానిస కావద్దని అన్నారు. అదేవిధంగా రోడ్డు భద్రత చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమ ంలో రూరల్ ఎస్ఐ బుచ్చిబాబు, పాఠశాల అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి, పాఠశాల పరిశీలన కమిటి అధ్యక్షులు నల్లమిల్లి వీర్రెడ్డి, పాఠశాల హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.



## పెద్ద రెడ్డి పై విమర్శించే శ్రద్ధ సంక్షేమాల పైన ఉంచాలి : మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్



బంగారుపాళ్యం (చిత్తూరు) అమృత్ తెలంగాణ: జనవరి 31. పెద్ద రెడ్డి రామచంద్రారెడ్డి పై విమర్శించే శ్రద్ధ సంక్షేమ పథకాలపై ఉంచాలని మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు .శుక్రవారం వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి స్వగఅహంలో సమావేశం జరిగినది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి పుంగునూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గత 20 సంవత్సరాలకు మునుపే చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములను అక్రమమని చెప్పడం చాలా దారుణమని. అధికారం చేపట్టేందుకు సూపర్ సిక్స్ పథకాలు చెప్పి దొడ్డి దారిన పదవి అలంకరించి సంక్షేమ పథకాలు అమలు చేయక వైసిపి నాయకులను పై బురద చల్లడం అలవర్చుకున్నారని వైసీపీ నాయకుల పై విమర్శించే శ్రద్ధ సంక్షేమ పథకాలపై కనబరచి బడుగు బలహీన వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి రాష్ట్ర సోషల్ మీడియా కిషోర్ కుమార్ రెడ్డి మండల సోషల్ మీడియా శైలేష్ ఎస్సీ మండల అధ్యక్షులు నాగరాజు బీసీ నాయకులు ప్రకాష్ బాలాజీ మురళి తదితరులు పాల్గొన్నారు




## చీరందంలో రెజీనా క్లీన్ అండ్ గ్రీన్!




అయితే రెజీనా చీర ధరించడానికి ఇక్కడో ప్రత్యేకత ఉంది. బీచ్ లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా బీచ్ లో ఉన్న చెత్తా చెదారం చేతికి గ్లౌవ్స్ వేసుకుని క్లీన్ చేస్తోంది. చెన్నై బ్యూటీ రెజీనా షెడ్యూల్ ఎంత బిజీగా ఉందో తెలిస్తే స్టన్ అవ్వాల్సిందే. జయాపజయాలతో సంబంధం లేకుండా అమ్మడు సినిమాలు చేస్తోంది. గతేడాది మూడు రిలీజ్ లతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అంతకు ముందు ఏడాది నాలుగు రిలీజ్ లతో థియేటర్లో కనిపించింది. మరి ఇందులో విజయాలు ఎన్ని అంటే బూతద్దం పెట్టి వెతికినా ఒక్క విజయం కూడా కనిపించదు. మరి 2024 లో పరిస్థితి ఏంటి? అంటే ఆ రెండు సంవత్సరాలను మించి సినిమాలు చేస్తోంది. మరో క్రేజీ కాంబో షురూ ప్రస్తుతం ఆరు సినిమాలు చేతిలో ఉన్నాయి. తమిళ్..హిందీలో కలిపి అన్ని సినిమాలకు కమిట్ అయింది. అయితే వీటిలో 'ఉత్సవం' అనే తెలుగు సినిమా ఒకటి ఉంది. కానీ ఇది డిలే అవుతోన్న ప్రాజెక్ట్. దాంతో సంబంధం లేకుండా రెజీనా మిగతా సినిమాలతో బిజీగా ఉంది. దాదాపు 17 ఏళ్లగా ఇండస్ట్రీలో ఇలా జర్నీ కొనసాగించడం అంటే చిన్న విషయం కాదు. సక్సెస్ లుంటే తప్ప అవకాశాలు రాని రోజుల్లో రెజీనా మాత్రం అందుకు భిన్నంగా సినిమా అవకాశాలు అందుకుంటుంది.

## జాన్వీ.. ఇప్పుడే అసలు గేమ్ మొదలైంది..




సెకండ్ మూవీగా ఫీ మేల్ ఒరియాంటెడ్ కథతో రియల్ లైఫ్ ఎయిర్ ఫైటర్ గుంజన్ సక్సేనా బయోపిక్ లో జాన్వీ కపూర్ నటించింది అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా బాలీవుడ్ లోకి అడుగుపెట్టిన అందాల భామ జాన్వీ కపూర్. మొదట్లోనే ఆమెకు బ్యాక్ గ్రౌండ్ ద్వారా మంచి అవకాశాలు వచ్చాయి. తండ్రి బోణి కపూర్ కూడా బాలీవుడ్ బడా నిర్మాత కావడంతో జాన్వీ కపూర్ కి కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్ లో మొదటి అవకాశం వచ్చింది. సైరత్ రీమేక్ ధడక్ తో ఆమె హీరోయిన్ గా అడుగుపెట్టి సూపర్ హిట్ అందుకుంది. సెకండ్ మూవీగా ఫీమేల్ ఒరియాంటెడ్ కథతో రియల్ లైఫ్ ఎయిర్ ఫైటర్ గుంజన్ సక్సేనా బయోపిక్ లో జాన్వీ కపూర్ నటించింది. ఆ మూవీ పర్వాలేదనే టాక్ తెచ్చుకుంది. తరువాత ఈ బ్యూటీ చేసిన సినిమాలు ఏవీ కూడా ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. అవన్నీ కూడా బోనీ కపూర్ నిర్మించినవే కావడం విశేషం. కూతురు కెరీర్ కోసం బోణి కపూర్ చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ సినిమా పడుంటే..! అయితే కూతురుని బాలీవుడ్ లో నిలబెట్టడానికి బోనీ కపూర్ చేసిన ప్రయత్నాలు పెద్దగా సక్సెస్ కాలేదు. ఆ సినిమాలు ఆమెకి ఆశించిన స్థాయిలో గుర్తింపు తీసుకురాలేదు. అయితే తెలుగులో ఊహించని విధంగా దేవర మూవీలో జూనియర్ ఎన్టీఆర్ కి జోడీగా నటించే అవకాశం ఈ అమ్మడు సొంతం చేసుకుంది. పాన్ ఇండియా లెవల్ లో ఈ మూవీ తెరకెక్కుతోంది. దసరాకి ప్రేక్షకుల ముందుకి రానుంది. మూవీపైన భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఇప్పుడు రామ్ చరణ్ కి జోడీగా 16లో జాన్వీ కపూర్ హీరోయిన్ గా ఖరారు అయ్యింది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఈ మూవీ సిద్ధం అవుతోంది. తాజాగా ఓపెనింగ్ కార్యక్రమం జరిగింది. పాన్ ఇండియా లెవల్ లో భారీ బడ్జెట్ తోనే ఈ మూవీ తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. ఇన్ని రోజులు బాలీవుడ్ లో ఎన్ని సినిమాలు చేసిన జాన్వీ కపూర్ కి ఆశించిన గుర్తింపు రాలేదు.

## డబుల్ ఇస్మార్ట్ రెమ్యునరేషన్.. ఇది అసలు మ్యాటర్



ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా రేంజ్ లో డబుల్ ఇస్మార్ట్ మూవీ రామ్ పోతినేని చేస్తున్నాడు. టాలీవుడ్ లో ఎనర్జిటిక్ హీరోగా తనకంటూ ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్న నటుడు రామ్ పోతినేని. ఈ జెనరేషన్ యువ హీరోలలో స్టైలిష్ లుక్ తో అమ్మాయిల కలల రాకుమారుడు అనే ఇమేజ్ కూడా రామ్ కి ఉంది. సక్సెస్, ఫెయిల్యూర్ తో సంబంధం లేకుండా అతను సినిమాలు చేసుకుంటూ వెళుతున్నాడు. ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా రేంజ్ లో డబుల్ ఇస్మార్ట్ మూవీ రామ్ పోతినేని చేస్తున్నాడు. వీరిద్దరి కాంబినేషన్ లో వచ్చిన బ్లాక్ బస్టర్ హిట్ ఇస్మార్ట్ శంకర్ కి సీక్వెల్ గా డబుల్ ఇస్మార్ట్ తెరకెక్కుతోంది. ఇదిలా ఉంటే ఈ సినిమాని రామ్ కెరియర్ లోనే భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. అయితే కొన్ని కారణాల వలన ఈ మూవీ షూటింగ్ ఆగింది. దీనికి రామ్ కారణం అనే ప్రచారం తెరపైకి వచ్చింది. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని తెలుస్తోంది. కేవలం ఆర్థిక సమస్యల కారణంగా కొద్ది రోజులు మూవీ షూటింగ్ వాయిదా వేశారంట. ఆ సినిమా పడుంటే..! ఈ సినిమా కోసం రామ్ రెమ్యునరేషన్ తీసుకోకుండా ప్రాఫిట్ లో షేర్ తీసుకొని చేయడానికి సిద్ధం అయ్యాడు. ముందుగా అడ్వాన్స్ తీసుకొని చేయాలని అనుకున్న కూడా తరువాత నిర్ణయం మార్చుకొని ప్రాఫిట్ షేర్ కి ఒకే చెప్పాడు. దీంతో మళ్ళీ షూటింగ్ స్టార్ట్ అయ్యింది. అయితే లైగర్ మూవీ ఇంపాక్ట్ డబుల్ ఇస్మార్ట్ మీద పడినట్లు తెలుస్తోంది. వీలైనంత వేగంగా పూరి జగన్నాథ్ ఈ మూవీ షూటింగ్ కంప్లీట్ చేయడంపై ఫోకస్ చేశాడని తెలుస్తోంది.

## వేదిక నడుము మాయ.. బికినీ కంటే ఘాటుగా..



నటిగా కూడా కొన్ని సినిమాలతో అమ్మడు పలు అవార్డులను కూడా సొంతం చేసుకుంది. రెండు పదుల వయసులోకి రాకముందే సినిమా ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టిన అందాల వేదిక భాషతో సంబంధం లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళుతోంది. ఈ బ్యూటీకి ఇప్పటివరకు ఇండస్ట్రీలో సాలిడ్ హిట్ అయితే పడలేదు. కానీ గ్లామరస్ బ్యూటీగా మాత్రం మంచి గుర్తింపు అయితే అందుకుంటుంది. నటిగా కూడా కొన్ని సినిమాలతో అమ్మడు పలు అవార్డులను కూడా సొంతం చేసుకుంది. అయితే ఆమె బ్యాడ్ లక్ ఏమిటో కానీ పెద్ద సినిమాలలో అవకాశాలు మాత్రం అస్సలు రావడం లేదు. ఇక ఎ మాత్రం ఖాళీగా ఉండకుండా అమ్మడు ప్రతి ఏడాది రెండు లేదా అంతకంటే ఎక్కువ సినిమాలు చేసుకుంటూ కనిపిస్తోంది. అలాగే నిత్యం సోషల్ మీడియాలో కూడా తన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తోంది. ఆ సినిమా పడుంటే..! రీసెంట్ గా ఈ బ్యూటీ పోస్ట్ చేసి కొన్ని ఫోటోలు చూస్తే స్టన్ అవ్వాల్సిందే. ముఖ్యంగా తన నడుము అందాలతో ప్రతిసారి అమ్మడు సరికొత్తగా ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. ఇటీవల మరోసారి ఈ బ్యూటీ తన నడుముతో ఫోటోలకు ఫోజు ఇచ్చిన విధానం కుర్రాళ్ళ మనసులను దోచేసింది. గతంలో బికినీలో కూడా దర్శనమిచ్చిన ఈ బ్యూటీ ఎప్పటికప్పుడు సరికొత్తగా కనిపిస్తోంది అని కామెంట్స్ చేస్తున్నారు. ఇక వేదిక మహారాష్ట్రలో పుట్టి పెరిగింది. మొదట మోడల్ గా మంచి గుర్తింపును సొంతం చేసుకున్న ఆమె ఆ తర్వాత బాలీవుడ్లో అవకాశాల కోసం ప్రయత్నం చేసింది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com